
ప్రజాశక్తి

బుధవారం 30 ఏప్రిల్ 2025

5



గిరిజన గురుకులాల్లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన గురుకుల రెసిడెన్సియల్ కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐటిడిఎ ఇన్‌ఛార్జ్ పిఒ ఎస్ఎస్ శోభిక మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్వతీపురం ఐటిడిఎ ఆధ్వర్యాన గిరిజన గురుకుల రెసిడెన్సియల్ కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి మే 18లోగా ఆన్ లైన్ వెబ్ సైట్ https:twreiscet.apcfss.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటర్ ఇంగ్లీష్ మాధ్యమంలో మొదటి సంవత్సరం ప్రవేశానికి సంబంధించి మొత్తం అన్ని గ్రూప్‌లు కలిపి 800 సీట్లు కేటాయించామన్నారు.

విద్యార్థులు ఎక్కువ... సీట్లు తక్కువ

గిరిజన విద్య కోసం కోట్లు ఖర్చు పెడుతున్నామని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు కార్పొరేట్ తరహాలో ఉన్నాయని, కావున మన ప్రభుత్వ విద్యాలయాల్లో విద్యార్థుల చేరాలంటూ ఒక వైపున ప్రచారం చేస్తున్నారు. అంతేకాక మన్యం జిల్లా గత మూడేళ్లుగా పదో తరగతి ఉత్తీర్ణతలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంగా నిలిచింది. అదే తరహాలో సీతానగరం మండలం పదో తరగతి ఉత్తీర్ణతలో ముందంజలో ఉంది. అంతవరకు బాగానే ఉంది. కానీ ఈ ఏడాది విద్యార్థులు అధిక సంఖ్యలో పదిలో ఉత్తీర్ణత సాధించారు. అందుకు తగ్గ కళాశాలల్లో సీట్లు లేకపోవడంతో గిరిజన విద్యార్థులు డ్రాప్ అవుట్స్‌గా మారనున్నారు.



- **పదిలో పెరిగిన ఉత్తీర్ణతతో ఇంటర్ విద్యకు గిరాకీ**
- **డ్రాపౌట్స్‌గా మారనున్న పేద విద్యార్థులు**

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని సీతంపేట బాలుర, బాలికల గురుకుల పాఠశాలు, గిరిజన బాలుర, బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల, కెజిబివి పాఠశాల, ధోనుబాయి పెద్దపోల్ల, చిన్న బగ్గా బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలు, సామరెల్లి, పూతికవలస, హడ్డుబంగి, ఓంద్రుజోల గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలు, నాయుడు మల్లిలో బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల, మల్లి బాలుర గురుకుల పాఠశాల, ముత్యాలులో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల. శంభోం బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలతో పాటు ప్రైవేట్ పాఠశాలలు నుంచి సుమారు 1300 మంది విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాశారు. వీరిలో 1250 మంది వరకు ఉత్తీర్ణులయ్యారు. అయితే సీట్లు మాత్రం సుమారు 510 వరకు ఉన్నాయి. ఇదే ఐటిడిఎ పరిధిలో 1600 మంది విద్యార్థుల వరకు ఉత్తీర్ణులయ్యారు. అయితే ఉత్తీర్ణత చెందిన విద్యార్థులు కళాశాలల్లో ప్రవేశించడానికి అందుకు సరిపడా సీట్లు లేకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని సీతంపేట బాలికల గురుకుల కళాశాలలో ఎంపిసి, బైపిసి, హెచ్ఇసి, ఎఎన్‌టి ఒకేషనల్ గ్రూప్‌లో 140 సీట్లు ఉన్నాయి. అదేవిధంగా గిరిజన బాలుర కళాశాలలో ఎంపిసి, బైపిసి, హెచ్ఇసి, సిజిఎ, ఎఎన్‌టి గ్రూపులకు 170 సీట్లు ఉన్నాయి. సీతంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ప్లస్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేశారు. ఇక్కడ ఎంపిసి, బైపిసి గ్రూపులకు 80 సీట్లు మాత్రమే ఉన్నాయి.

అలాగే కెజిబివి ఒకేషనల్ కళాశాలలో ఎంపిహెచ్‌డబ్ల్యు ఒకేషనల్ ఒక గ్రూపు 40 సీట్లు మాత్రమే ఉన్నాయి. అదే తరహాలో మల్లి ప్రతిభ కళాశాలలో ఎంపిసి, బైపిసి గ్రూపులకు 80 సీట్లు మాత్రమే ఉన్నాయి. ఇక్కడ పివిటిజి విద్యార్థులు జోనల్ వైజ్‌గా 5 జిల్లాల నుంచి విద్యార్థులను ప్రతిభా ప్రవేశ పరీక్ష ఆధారంగా ఎంపిక చేస్తారు. మండలంలో గల కళాశాలల్లో 500 సీట్లు మించి ఉండవు. మిగిలిన విద్యార్థులు అందరూ పేద విద్యార్థులే కార్పొరేట్ కళాశాలలో చదువుకునే ఆర్థిక స్థోమత ఉండదు. దీంతో వీరంతా డ్రాప్ అవుట్స్‌గా మారే అవకాశం ఉంది.

గతంలో ప్రతిపాదనలు పంపించాం

పదిలో ఉత్తీర్ణులైన విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని కొన్ని పాఠశాలలను కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని గతంలో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాం. ఇంకా రావాల్సి ఉంది.

ఎం అన్న దొర, డిప్యూటీ డైరెక్టర్
గిరిజన సంక్షేమ శాఖ, సీతంపేట ఐటిడిఎ

గత ఏడాది కళాశాలకు దరఖాస్తులు

గత ఏడాది సీతంపేట బాలుర గురుకుల కళాశాలలో 170 సీట్లకు 382 దరఖాస్తులు రాగా, బాలికల గురుకుల కళాశాలలో 140 సీట్లకు 635 దరఖాస్తులు వచ్చాయి. గతంలో ఐటిడిఎ ఉన్నతాధికారులు పదిలో పాసైన విద్యార్థుల సంఖ్యను దృష్టిలో పెట్టుకొని కొన్ని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలు హడ్డుబంగి, దోనుబాయి, మల్లి, పెద్దమడి, కిల్లోయి, జయపురం పాఠశాలను కళాశాలగా అప్గ్రేడ్ చేయాలని 2022 -23 లో ప్రతిపాదనలో పంపించారు. ఏళ్లు గడుస్తున్నా ఈ ప్రతిపాదనలు అమలుకు నోచుకోవడంలేదు. దీంతో ఇంటర్ సీట్లకు కొరత ఏర్పడింది.

గురుకుల కళాశాల ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

సీతంపేట ఐటిడిఎ పరిధిలో గల పెద్దమడి బాలుర, సీతంపేట బాలికల గురుకుల కళాశాలల్లో ప్రవేశానికి ఎస్టీ, ఎస్సీ, బిసి, ఒసి అభ్యర్థులు దరఖాస్తులను మే18 లోగా దరఖాస్తు చేసుకోవాలని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈఏడాది పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు https://twreiset.apcfss.in వెబ్సైట్‌కు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎపి ఆర్ బాలుర గురుకుల కళాశాలలో మే 24న కౌన్సిలింగ్ జరుగుతుందన్నారు, ఎంపిసి, బైపిసి, సిఇసి, హెచ్ఇసి, సిజిఎ, ఎఎ టీ 430 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సురేంద్ర

మన్యం బంద్‌కు ప్రజాసంఘాల మద్దతు

- **ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలి**
- **రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆర్డినెన్స్ ఇవ్వాలి**

ప్రజాశక్తి - పార్వతీపురం

మెగా డీఎస్సీ నుంచి ఆదివాసీ ప్రాంత పోస్టులు మినహాయించాలని డిమాండ్ చేస్తూ ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటి మే 2న పిలుపునిచ్చిన మన్యం బంద్ విజయవంతం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.రామస్వామి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన అధ్యక్షతన స్థానిక సుందరయ్య భవన్‌లో జరిగి రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రజాసంఘాలు సంపూర్ణ మద్దతు తెలిపాయి. తొలుత ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ మేరకు ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆర్డినెన్స్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఆదివాసీలకు కేవలం 42 మాత్రమేనని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిఆదివాసీ నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. జిఒ 3 వల్ల ఆదివాసీ ప్రాంతంలో 100 శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ నియామకల్లో న్యాయం జరిగేదని, ఈ జిఒ రద్దుతో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసి ఏజెన్సీ ప్రాంతాల్లో స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలకు ఆర్డినెన్స్ తీసుకుని వచ్చి ఏజెన్సీ ప్రాంతాల్లో వంద శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ నియామక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. మెగా డీఎస్సీ నుండి ఆదివాసీ ప్రాంతాల్లో మినహాయింపు ఇవ్వాలి కోరారు. ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ ఆధ్వర్యం లో మే 2న పిలిపిచ్చిన ఏజెన్సీ బంద్ కార్య క్రమానికి అఖిలపక్ష ఆదివాసీ, ప్రజా సంఘాలు సంపూర్ణ మద్దతు ఇస్తుందని, బంద్ విజయవంతం చెయ్యాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షు లు డేవిడ్, గంగారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు పి.రాము తదితరులు పాల్గొన్నారు

మలేరియా రాకుండా చర్యలు తీసుకోవాలి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ పరిధిలోని గ్రామాల్లో మలేరియా సోకకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. మలేరియా నివారణకు అన్ని శాఖల అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై సమన్వయ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఐటిడిఎ పరిధిలోని ఏజెన్సీ గ్రామాల్లో మలేరియా ఎక్కువగా ఉంటుందని, దీన్ని నివారించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. మలేరియా వ్యాధి వ్యాప్తిపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్యంపై పంచాయతీ సిబ్బంది ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామాల్లో తరచుగా వైద్య పరీక్షలు నిర్వహించాలని వైద్యాధికారులకు సూచించారు. మలేరియా పరీక్షలకు సంబంధించిన కిట్లను ఎఎన్ఎంలకు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మలేరియా పాజిటివ్ వచ్చిన వారికి వెంటనే చికిత్స ప్రారంభించాలని వైద్యాధికారులకు సూచించారు. పాజిటివ్ వచ్చిన వ్యక్తిని ఏరియా హాస్పిటల్‌కి గానీ సిహెచ్‌సికి గాని వెంటనే రిఫర్ చేయకుండా పిహెచ్‌సి స్థాయిలో చికిత్స జరిగేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. 159 గ్రామాల్లో స్ప్రేయింగ్ మొదటి రౌండ్ చేయాలన్నారు. పిహెచ్‌సిల్లో మందుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పూర్తి కొరత ఉన్న పిహెచ్‌సిలకు ఐటిడిఎ ద్వారా సరఫరా చేస్తామని పీవో అన్నారు. అన్ని గ్రామాల్లో మలాథియన్ స్ప్రేయింగ్ చేయించాలని మలేరియా సిబ్బందికి సూచించారు. స్ప్రేయింగ్‌ను మలేరియా సూపర్వైజర్లు పర్యవేక్షించాలన్నారు. మలేరియా పాజిటివ్ వచ్చిన వ్యక్తితో పాటు ఇరువైపులా 10 కుటుంబాలకు చెందిన వ్యక్తులకు మలేరియా టెస్టులు చేయాలని అన్నారు. పరిసరాల్లో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని అన్నారు. మైనింగ్ జరిగే అటవీ ప్రాంతాల్లో కొండను తవ్వేటప్పుడు ఏర్పడిన లోతుల్లో నీరు నిల్వ ఉండడం వల్ల మలేరియా వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయని, వాటిని నివారించాలని అటవీశాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఐటిడిఏ డిప్యూటీ డిఎంహెచ్ఒ కె.విజయపార్వతి, డిఎంఒ, సత్యనారాయణ 4 మండలాల ఎంపిడిఒ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ సత్యం, వైద్యాధికారులు భాను ప్రతాప్, చాందిని, సత్యవేణి, మలేరియా సబ్ యూనిట్ అధికారి జె.మోహనరావు, సిబ్బంది, ఫారెస్ట్ అధికారులు, సిడిపిఒలు, రంగలక్ష్మి మలేరియా ఎఎంఒ శ్రీనివాసరావు, సలహాదారు శ్రీకాంత్, సిబ్బంది, పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

బాలలందరికీ ఆధార్ కార్డులు : జెసి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఆధార్ లేని బాలలందరికీ మే 31 నాటికి ఆధార్ కార్డులను మంజూరు చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోబిక మండల అధికారులు, ఐసిడిఎస్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో 0-6 ఏళ్లలోపు గల బాలలు 3,743 మంది ఉన్నారని, వీరికి జనన ధృవీకరణ పత్రాల్లేనందున ఆధార్ కార్డులు మంజూరు కాలేదని తెలిపారు. కావున వీరందరికీ ముందుగా జనన ధృవీకరణ పత్రాలను జారీ కోసం ఆధార్ కార్డులు లేని బాలల జాబితాలను ఆయా మండలా లకు పంపినట్టు తెలిపారు. పిల్లల జనన వివరాలకు సంబంధిత అంగన్వాడీ కేంద్రాల్లో ఉంటాయని, వాటి ఆధారంగా పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పిల్లల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రుల నుంచి దరఖాస్తులను స్వీకరించాలని అన్నారు. ఈ ప్రక్రియ మే 2 నాటికి పూర్తికావాలని ఆదేశించారు. ఎమే 18 లోగా జనన ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేయాలని తహశీల్దార్లను ఆదేశించారు. పాచిపెంటలో 989, కురుపాంలో 434, గుమ్మలక్ష్మీపురంలో 277, మక్కువ, సాలూరు, సీతంపేట తదితర ప్రాంతాల్లో అధికంగా జనన ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులు స్వీకరించాల్సి ఉందని, కావున సంబంధిత అధికారులు వీటిపై ప్రత్యేక దృష్టిని సారించాలని ఆమె పేర్కొన్నారు. జనన ధ్రువీకరణ పత్రాలు, పింఛన్లు, గహాలు, నీటి పన్ను, రీసర్వే తదితర అంశాలపై తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మండల వ్యవసాయ అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, సిడిపిఒలతో కలెక్టర్ కార్యాలయంలోని వీడియో సమావేశ మందిరం నుంచి మంగళవారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా జెసీ మాట్లాడుతూ ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను మే 1న ఉదయం లబ్ధిదారులందరికీ పింఛన్లు పంపిణీకావాలని అన్నారు. ఇందుకు సంబంధించిన నగదును ఏప్రిల్ 30 నాటికి సిద్ధం చేసుకోవాలని, చెప్పారు. ఇళ్ల కోసం వచ్చే దరఖాస్తులను సంబంధిత ఆన్ లైన్ పోర్టల్ నందు నమోదు చేయాలని, ప్రతి దరఖాస్తును పరిగణలోకి తీసుకోవాలని అన్నారు. వెబ్ ల్యాండ్ -1 లోని వివరాల ఆధారంగా రీసర్వేలోని వివరాలను సరిచూసుకొని నమోదు చేయాలన్నారు. నీటి పన్ను వసూళ్ల వివరాలను సిద్ధం చేసుకోవాలని, పోర్టల్ నందు అవకాశం కల్పించిన వెంటనే నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో పాలకొండ సబ్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, కెఆర్ఆర్సీ ప్రత్యేక ఉప కలెక్టర్ డా.పి.ధర్మచంద్రారెడ్డి, డ్వామా, డిఆర్డిఎ, ఐసీడిఎస్ పీడీలు కె.రామచంద్రరావు, ఎం.సుధారాణి, డా. టి.కనకదుర్గ, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మండల వ్యవసాయ అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, సీడీపీఓలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెసి శోబిక, పక్కన డిఆర్ఒ హేమలత

ఆర్ఆర్ఆర్ వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరం

ప్రజాశక్తి - పార్వతీపురం



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాస రావుపై అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు అన్నారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన రఘురామ కృష్ణంరాజు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ప్రజలకు జీవించే హక్కు ఉందని, ఆ హక్కును హరించేలా పశ్చిమగోదావరి జిల్లా ఉండి అసెంబ్లీ నియోజకవర్గంలో పేదల ఇళ్లను కూల్చి వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో పేదలకు మద్దతుగా ఉద్యమంలో పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై అసభ్యకరమైన రీతిలో సభ్య సమాజం తలదించుకునేలా రఘురామకృష్ణంరాజు వ్యాఖ్యానించడం తీవ్ర అభ్యంతరకరమని అన్నారు. ఇది ఆయన అహంకార పూరిత ధోరణికి నిదర్శనమని, ఈ ధోరణి ప్రజాస్వామ్య దేశంలో మంచిది కాదని హెచ్చరించారు. ప్రజా ఉద్యమంలో సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న వి శ్రీనివాసరావు లాంటి వ్యక్తులు పట్ల ఇలాంటి వ్యాఖ్యలు చేసిన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు ఆ పదవికి అనర్హుడని విమర్శించారు. ఇప్పటికే అనేక ఆర్థిక నేరాలకు పాల్పడి కేసులు ఎదుర్కొంటున్న రఘురామ కృష్ణంరాజు ఇలాంటి అత్యున్నతమైన డిప్యూటీ స్పీకర్ స్థానంలో ఉండడం మంచిది కాదని హెచ్చరించారు. రఘురామ కృష్ణంరాజు లాంటి వ్యక్తులను అదుపులో ఉంచే బాధ్యత ముఖ్యమంత్రిపై ఉందని అన్నారు. ఇప్పటికైనా రఘురామ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, శ్రీనివాసరావుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిచో రఘురామకృష్ణంరాజు అహంకార పూరిత వైఖరికి నిరసనగా, ఉండి నియోజకవర్గంలో పేదలకు మద్దతుగా రాష్ట్ర వ్యాప్త ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బివి రమణ, గొర్లె వెంకటరమణ పాల్గొన్నారు.

ఈ కమిషనర్ మాకొద్దు

పార్వతీపురం చైర్‌పర్సన్ గౌరీశ్వరి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు పనితీరు ఏమీ బాగోలేదని, కనీసం చైర్పర్సన్, వైస్ చైర్పర్సన్లతో పాటు కౌన్సిల్ సభ్యులతో ప్రోటోకాల్ కూడా పాటించడం లేదని, పాలకవర్గ కౌన్సిల్ సభ్యులు చెప్పిన ఏ పనీ చేయడం లేదని, వార్డు సమస్యల గురించి చెబితే కనీసం స్పందించడం లేదని చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, ఇండుపూరు గున్నేష్, కౌన్సిల్ సభ్యులు నిమ్మకాయల సుధీర్, సంగంరెడ్డి లక్ష్మీపార్వతి, ఎడ్ల త్రినాథ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం చైర్‌పర్సన్ తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ కోడ్ అయిపోయిన వెంటనే బడ్జెట్ సమావేశాన్ని, కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని పెట్టమని పలుమార్లు కౌన్సిల్ సభ్యులతో కలిసి కమిషనర్ వెంకటేశ్వర్లుకు చెప్పినా కాలయాపన చేశారు తప్ప సమావేశాన్ని పెట్టడం లేదని అన్నారు. మంగళవారం (29న) కౌన్సిల్ సమావేశం పెడతామని చెప్పారని, అజెండాలో సమస్యల గురించి చెప్పామని తెలిపారు. అయితే సోమవారం (28 తేదీ) వరకు అజెండా రాకపోవడంతో మంగళవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయానికి వచ్చామని తెలిపారు. కమిషనర్ కార్యాలయంలో లేకపోవడంతో ఫోన్లో సంప్రదించగా వార్డుల్లో ఉన్నానని, వస్తున్నానని చెప్పడంతో మధ్యాహ్నం ఒంటి గంట వరకు వేచి ఉన్నప్పటికీ మున్సిపల్ కార్యాలయానికి రాకుండా తప్పించు కున్నారని అసహనం వ్యక్తం చేశారు. కమిషనర్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అభివృద్ధి పనులు జరగడం లేదని, వార్డు సమస్యలు పరిష్కారం కావడం లేదని, కమిషనర్ టిడిపి కార్యకర్తగా వ్యవహరిస్తున్నారని, కనీసం ప్రోటోకాల్ పాటించడం లేదని విమర్శించారు. తమ చాంబర్లో ఎసి మరమ్మతులు గురైందని, బెల్ పని చేయడం లేదని, ఛాంబర్‌లో అభివృద్ధి పనులు చేపట్టాలని చెప్పినప్పటికీ కనీసం పట్టించుకోలేదని, కమిషనర్ చాంబర్లో అభివృద్ధి పనులు చేపట్టి, పనిచేస్తున్న ఎసిని తొలగించి, ఒక కొత్త కుర్చీని, రూ.80 వేలతో ఎసిని ఎవరు అనుమతి లేకుండా వేసుకున్నారని అన్నారు. కార్యాలయంలో ఉన్న సహోద్యోగులు కూడా కమిషనర్ తీరుపై ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి కమిషనర్ ఈ మున్సిపాలిటీకి అవసరం లేదని అన్నారు. ఆయనపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదును ఇస్తున్నామని, కలెక్టర్ మున్సిపాలిటీ అభివృద్ధిపై దృష్టి సారించి కొత్త కమిషనర్ నియమకాన్ని చేపట్టాలని కోరారు.

రోగులతో ఆస్పత్రి కిటకిట

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వేసవి ఎండల కారణంగా వివిధ వ్యాధులతో మన్యంలో ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. మండలంలోని భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోజురోజుకు పెరుగుతున్న రోగులతో రోజువారి ఓపి 250కు పైగా నమోదు అవుతుంది. వేసవి ఎండల ప్రభావం చిన్నా పెద్దా అన్న తేడా లేకుండా అందరిపైనా చూపుతోంది. జ్వరం, తలనొప్పి, ఒంటి నొప్పులు వంటి లక్షణాలతో భద్రగిరి ఆసుపత్రిలో రోజురోజుకు రోగుల సంఖ్య వైద్యం కోసం చేరడంతో మంచాలు చాలడం లేదు. దీంతో చేసేది లేక ఒకే మంచంపై ఇద్దరు, ముగ్గురు రోగులకు వైద్యం అందిస్తున్నారు. వర్షాకాలం, వేసవికాలం అన్న తేడా లేకుండా వ్యాధుల విజృంభన ఏజెన్సీలో ఏడాది అంతటా కనిపిస్తోంది.



భద్రగిరి సిహెచ్‌సిలో చికిత్స పొందుతున్న రోగులు

చిన్న వర్షానికే ఛిద్రమైన రహదారి

- **బిటి చేయకముందే బీటలు**
- **ఇదీ మంత్రి ఇలాకాలో రోడ్ల దుస్థితి**

ప్రజాశక్తి - సాలూరు

చిన్న వర్షానికే ఆ రహదారి ఛిద్రమయింది. రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఆరు నెలల్లోనే అతుకుల బొంతలా మారింది. మండలంలోని కూర్మరాజుపేట పంచాయతీ చిన్నవలస రోడ్డు జంక్షన్ నుంచి పునికిల వలస రోడ్డు జంక్షన్ వరకు రూ.50 లక్షలతో బిటి రోడ్డు నిర్మాణానికి గత ఏడాది అక్టోబర్ 28న రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ పిక్క రాయితో చదును చేసి వదిలేశారు. రోడ్డుకు ఇరువైపులా సైడ్ బెర్మ్‌లు బలంగా నిర్మించకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు కోతకు గురైంది. పిక్కరాయి తేలిపోయింది. తారు వేయకముందే బీటలు వారింది. దీంతో ఈ గ్రామస్తులు నరకయాతన అనుభవిస్తున్నారు. నియోజకవర్గ పరిధిలో బిటి రోడ్డు పనులన్నీ పట్టణానికి చెందిన ఓ క్వారీ యజమాని చేస్తున్నారు. మంత్రి సంధ్యారాణి సిఫార్సు మేరకు ఆ కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా బిటి రోడ్డు పనులు చేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. రహదారి నిర్మాణం పూర్తి కాకముందే ఇలావుంటే బిటి వేసిన ఎలా ఉంటుందోనని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




వర్షానికి తేలిపోయిన పిక్కరాయి, కోతకు గురైన రోడ్డు

ఎల్లంకివీధికి ఎట్టకేలకు మెట్లు ఏర్పాటు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని ఎల్లంకి వీధికి ఎట్టకేలకు మెట్లు ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారి విస్తీర్ణ అభివృద్ధి పనుల్లో భాగంగా నిర్మాణ పనులు జరిగినప్పుడు తమ వీధికి వెళ్లే రహదారికి కాలువ ఎత్తుగా కట్టడం వల్ల సుమారు నాలుగేళ్లుగా రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఇటీవల ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈమేరకు ఎమ్మెల్యే స్పందించి ఇక్కడ మెట్ల నిర్మాణ పనులు జరగడంతో ఎల్లంకి వీధి వాసులు ఆనంద వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఇళ్లకు వెళ్లే రహదారికి మధ్యలో కాలువ ఏర్పాటు చేయడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, కాలువపై సిమెంట్ పలుకలు ఏర్పాటు చేయాలని, ఈ వీధివాసులు అధికారులను కోరుతున్నారు.



ఎంపిడిఒకు వినతిని అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తాళ్లబురిడికి తాగునీరు ఇవ్వండి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని తాళ్లబురుడిని వేధిస్తున్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈమేరకు మంగళవారం ఎంపిడిఒ జి.రమేష్‌ను కలిసి వినతి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని తాళ్లబురిటితో పాటు పలు గ్రామాలను తాగునీటి సమస్య వేధిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిలో భాగంగా తాళ్లబురిడిలోని పాత బజారు వీధి, మధ్య వీధి, దిగువ ఎస్‌సి వీధి, గొల్లవీధి, శాలివీధి, కాలనీ తదితర ప్రాంతాలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. చేసేదిలేక కొనుక్కొని తాగుతున్నారన్నారు. తాళ్లబురిడితో పాటు మండలంలోని సంధివలస, ధోని గెడ్డ, ములగవలస, తొక్కుడువలస, కొత్తపాకలు, నోవవలస, కొత్త తాన్నవలస, చొక్కాపుగానివలస, బందలుప్పి, బుచ్చింపేట, మెట్టవలస, డీకే పట్నం, టేకులోవ తదితర గ్రామాల్లో నీటి ఎద్దడి ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. తాగునీటి సమస్య ఆయా గ్రామాల్లో పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఒబిసి పార్వతీపురం మన్యం జిల్లా చైర్మన్ వంగల దాలి నాయుడు, జిల్లా నాయకులు కోలాకిరణ్ కుమార్, మండల అధ్యక్షులు తీళ్ల గౌరీ శంకరరావు, మండల నాయకులు బి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఎల్‌డిఒ గోపాలకృష్ణ

'పిఎం జన్‌మన్' లక్ష్యాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - సీతంపేట

పిఎం జన్మన్ గృహాల లక్ష్యాలు శరవేగంగా పూర్తి చేయాలని పాలకొండ డిఎల్‌డిఒ, మండల ప్రత్యేక అధికారి వివి గోపాలకృష్ణ అన్నారు. మంగళవారం సచివాలయంలో కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వే పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడాలన్నారు. ఇంటి పన్ను లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో తాగునీరు, ఇతర సమస్యలను పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఎంపిడిఒ కృష్ణారావు, కార్యదర్శి రామకృష్ణ, రవి, సుదర్శన్‌రావు, వినోద్, అప్పలసూరి, రాజశేఖర్, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం

ప్రజాశక్తి - భామిని

స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాన్ని గ్రంథాలయధికారి టి.ఇందిరా మంగళవారం ప్రారంభించారు. ఈ గ్రంథాలయం శిక్షణ శిబిరాన్ని జూన్ 6 వరకు నిర్వహిస్తామని తెలిపారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం పుస్తక పఠనం నిర్వహించారు. ఈ శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

పాలకొండ: స్థానిక శాఖా గ్రంథాలయం పాలకొండ వేసవి శిబిరంలో భాగంగా మంగళవారం పిల్లలకు నీతి కథలు బోధించారు. పిల్లలకు పెద్దలు అంటే గౌరవం, భక్తి భావం వుండాలి అని కొన్ని నీతి కథల రూపంలో చెప్పారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి. దుర్గా ప్రసాద్, విశ్రాంత ఉపాధ్యాయులు మండల వెంకట రమణ, ఫకీరురావు, ఇంచార్జి గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు, సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

కొండలరావును కలిసిన చైర్మన్ దంపతులు

ప్రజాశక్తి - పాలకొండ

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, స్థానిక నగర పంచాయతీ సమన్వయకర్త పల్లా కొండబాబును మంగళవారం ఆయన స్వగృహంలో కొత్తగా ఎన్నికైన నగరపంచాయితీ చైర్మన్ ఆకుల మల్లేశ్వరి, ఆమె భర్త కుమార్ పుష్పగుచ్చంతో సత్కరించారు. గత దశాబ్దాలుగా ఎందరో ఔత్సాహికులను రాజకీయాల్లో నిలబెట్టి గొప్ప నేతలుగా తయారుచేసిన వ్యక్తి కొండబాబు అని మల్లేశ్వరి కొనియాడారు. నగరపంచాయితీ పరిధిలో పార్టీలకు అతీతంగా పనిచేస్తూ అందరిని కలుపుకొని పాలకొండను అభివృద్ధి బాటలో నడపమని నూతన చైర్మన్‌కు కొండబాబు మార్గనిర్దేశం చేశారు. పదవి ఒక అలంకారం మాత్రమే కాదని మనపేరు చరిత్రలో నిలిచిపోయేలా చేసుకునే అవకాశం అని సూచనలు అందజేశారు చూడాల్సిందే.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర) ప్రాంగణంలో మంగళవారం 1986 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బి.సత్యానందం, పి.భరతుడు, వాన సత్యానందం, పి.సుందరరావు, ఎం.దొర, నందికేశ్వరరావు, జి.రాములు, సిర పాణి, పి.వెంకటలక్ష్మి అప్పటి గురువులకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఒకర్ని ఒకరు ఆప్యాయతగా పలకరించుకొని వారి వారి కుటుంబ విషయాలను స్నేహితులతో చెప్పుకొని సరదాగా గడిపారు. అనంతరం వివిధ సినీ గేయాలకు నృత్య ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో డి జయశంకర్ దేవ్, బి సాయి ,డి శ్రీనివాసరావు, బి బాబురావు, ఆర్ రత్నాకర్, ఏ బాబురావు, బి అప్పలనాయుడు, ఎం.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లా వ్యాప్తంగా పలు కోచింగ్ సెంటర్లు విద్యార్థుల తల్లిదండ్రుల జేబులను లూటీ చేస్తున్నారని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్ ఆరోపించారు. మంగళవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో విలేకరుల ఆయన మాట్లాడుతూ ఎంసెట్, పాలీసెట్, సైనిక్, నవోదయ, ఇలా రకరకాల కోచింగ్ సెంటర్ల పేర్లు చెప్పి పూర్తిస్థాయి అనుమతులు లేకుండా విద్యార్థులకు మౌలిక సదుపాయాలు లేకుండా వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. వేసవికాలంలో సెలవులను ఉపయోగించుకొని 1వ తరగతి నుంచి పీజీ విద్యార్థుల వరకు ఫీజులు ఎలా వసూలు చేయాలో అన్ని రకాలుగా వసూళ్లకు పాల్పడుతున్నారని అన్నారు. కావున సంబంధిత అధికారులు వెంటనే స్పందించి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

రాయితీపై పశు దాణా

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

పశువుల ఆరోగ్యం, ఉత్పత్తిని కాపాడ్డానికి 50 శాతం రాయితీపై పశువులకు నాణ్యమైన సమీకృత దాణా సరఫరా చేస్తున్నట్టు జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ శివ్వాల మన్మథరావు తెలిపారు. జిల్లాకు 250 మెట్రిక్ టన్నుల పశు దాణా కేటాయించామన్నారు. పశు దాణా పొందేందుకు రైతులు ఆవులు, గేదెలు కలిగి ఉండాలని, తెల్ల రేషన్ కార్డుదారులు - దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న రైతులకు ఇది వర్తిస్తుందని చెప్పారు. పశువులకు టీకాలు వేసి ఉండాలని, పశుగణనలో నమోదు ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఐఎన్‌ఎపిహెచ్ చెవి పోగు కలిగి ఉండాలని ఆయన అన్నారు. ఒక ఇంటికి నెలకు 50 కిలోల బస్తా చొప్పున జూన్ వరకు మూడు బస్తాలు సరఫరా చేస్తామన్నారు. ఒక బస్తా పశు దాణా విలువ రూ.1,110 కాగా సబ్సిడీ పోనూ రూ.555 చెల్లించాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన రైతులు సమీపంలోని పశువైద్య కేంద్రంలో గానీ, రైతు సేవా కేంద్రం (%క్ష్మాఖ%)లో గానీ వివరాలు నమోదు చేయించి డబ్బులు చెల్లించి రసీదు పొందాలని ఆయన కోరారు.

వంద పడకల ఆస్పత్రిగా భద్రగిరి

డిసిహెచ్‌ఎస్ నాగ శివజ్యోతి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రోజురోజుకు పెరుగుతున్న రోగుల సంఖ్య దృష్ట్యా భద్రగిరి 50 పడకల ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా మార్చేందుకు ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు వచ్చాయని జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ నాగశివజ్యోతి తెలిపారు. మండలంలోని నిర్మాణంలో ఉన్న భద్రగిరి 50 పడకల ఆసుపత్రి భవన నిర్మాణ పనులను స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్మాణ పనుల తీరు ప్రతి గదికి వెళ్లి పరిశీలించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పెరుగుతున్న వ్యాధులు, రోగుల సంఖ్య దృష్టిలో పెట్టుకుని భద్రగిరి ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా రూపాంతరం చేసేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయన్నారు. ఇందుకు సంబంధించి అవకాశాలు, అవసరాలు పరిశీలన చేయడానికి వచ్చినట్లు చెప్పారు. మరో రెండు, మూడు నెలలు ఆసుపత్రి నిర్మాణ పనులు అయ్యేలా కనిపిస్తున్నాయని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే జగదీశ్వరి, సిఎం చంద్రబాబు కృషి ఫలితంగా భద్రగిరి ఆసుపత్రి అభివృద్ధి చెందుతుందని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే జగదీశ్వరి మాట్లాడుతూ ఏజెన్సీలోని గిరిజనులకు మెరుగైన వైద్యసేవల కోసం దూర ప్రాంతాల్లో గల ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తుందని, ఈ తరుణంలో ఈ ప్రాంతంలో అన్ని సౌకర్యాలతో వంద పడకల ఆసుపత్రి ప్రతిపాదనలు ఏజెన్సీ ప్రజలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు రమ్య, రాజన్, ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, కురుపాం మండల టిడిపి కన్వీనర్ కొండయ్య, నాయకులు బలరాం, రాజేష్, మన్మధరావు కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జగదీశ్వరిని కలిసిన డిసిహెచ్‌ఎస్

స్థానిక టిడిపి క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని డిసిహెచ్‌ఎస్ నాగశివజ్యోతి మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆమె ఏజెన్సీలో గల ఆసుపత్రులను పరిశీలించడానికి వచ్చి స్థానిక ఎమ్మెల్యేతో చర్చించారు. ఏజెన్సీలో ఉన్న గిరిజనులకు మెరుగైన వైద్య సేవలందించడానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని డిసిహెచ్‌ఎస్‌కు ఎమ్మెల్యే సూచించారు.



భద్రగిరి సిహెచ్‌సి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి, డిసిహెచ్‌ఒ నాగశివ జ్యోతి

కురుపాం : రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిసిహెచ్‌ఎస్ డాక్టర్ నాగశివ జ్యోతి వైద్యాధికారులకు, సిబ్బందికి సూచించారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా నిర్మాణం జరుగుతున్న 50 పడకల ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి రోజువారి ఒపి, రోగులకు అందుతున్న వైద్య సేవలు గూర్చి అడిగి తెలుసుకొని రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం వార్డులను సందర్శించి రోగులతో మాట్లాడి వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

రోగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలకు సిఫార్సులు చేస్తామని ఎమ్మెల్యే బోనేలా విజయచంద్ర వైద్యులను హెచ్చరించారు. మంగళవారం స్థానిక జిల్లా కేంద్ర ఆసుపత్రిని ఆకస్మికంగా పరిశీలించిన ఆయన వైద్యులతో కలిసి రోగులకు అందుతున్న సౌకర్యాలను, సేవలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, డయాలసిస్ వార్డులను సందర్శించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు. అలాగే రోగుల వార్డుల్లో గల మరుగుదొడ్ల నిర్వహణ, రోగులకు పెడుతున్న పౌష్టికాహారం, అక్కడున్న ల్యాబ్‌ల నిర్వహణ సక్రమంగా చేయాలని సూచించారు. వైద్యులను పిలిపించి మీరంతా సమయపాలన పాటించి రోగులకు వైద్య సేవలందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంబంధిత వైద్యులతో మాట్లాడుతూ చిన్నపిల్లలకు ఏదైనా సమస్య ఉంటే ఏరియా ఆసుపత్రిలో పరీక్షించి చికిత్స చేయాలి కాని ప్రతి టెస్ట్‌కు బయటకు పంపించడం ఎంతవరకు సమంజసమని వైద్యులను ప్రశ్నించారు. అలాగే అన్ని సౌకర్యాలు ఈ ఆసుపత్రిలో ఉన్నప్పటికీ వైద్య పరీక్షల కోసం ఎందుకు పంపిస్తున్నారని ప్రశ్నించారు. ఈ ప్రశ్నలకు వైద్యులు సమాధానం చెప్పకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే రోగుల బంధువులను ఆయన ఆప్యాయంగా పలకరించి మీకు ఏమైనా ఆసుపత్రిలో సమస్యలు ఉన్నాయా అని అడగ్గా రోగుల బంధువులు సమాధానం అయోమయంగా చెప్పడంతో ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో రోగులకు ఎటువంటి సమస్యలు ఎదురైన వెంటనే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఇకపై ఆసుపత్రిలో ఇటువంటి సమస్యలు పునరావృతమైతే వైద్యులపైనా, సిబ్బందిపైనా శాఖాపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బెలగాం జయప్రకాష్ నారాయణ (జయబాబు), టిడిపి సీనియర్ నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, గుంట్రెడ్డి రవికుమార్, డాక్టర్ గరిమెళ్ళ భాను ప్రసాద్, యందవ నిర్మలాకుమారి, జొన్నాడ శ్రీదేవి, మంచిపల్లి సత్యనారాయణ, కౌన్సిలర్లు బడే గౌరునాయుడు, సారిక గణేష్, హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది టిడిపి నాయకులు పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

గిరిజన డిఎస్‌సికి ఎమ్మెల్యేలు ఒప్పించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వంలో గల గిరిజన ఎమ్మెల్యేలు మౌనం వీడి ముఖ్యమంత్రితో మాట్లాడి ఒప్పించి గిరిజన ప్రత్యేక డిఎస్సీ ప్రకటన చేసేలా ప్రయత్నించాలని గిరిజన సంక్షేమ సంఘం, ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్, గిరిజన విద్యార్థి సంఘం, ట్రైబల్ స్టూడెంట్స్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆ సంఘాల నాయకులు పాలక రంజిత్ కుమార్, తాడంగి సాయిబాబు, ముమ్వల అమర్నాథ్, పల్ల సురేష్, పాలవలస భగవాన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కురుపాం, అరకు ఎన్నికల ప్రచారంలో గిరిజన ఉద్యోగాలు గిరిజనులకే ఇస్తామని జిఒ 3 తరహా మరో జిఒ తెస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. దీన్ని విస్మరించి ఇచ్చిన డిఎస్సీ నోటిఫికేషన్‌తో గిరిజన ఉపాధ్యాయ అభ్యర్థులకు తీవ్ర నిరాశ తప్ప ఎటువంటి ప్రయోజనం లేదని అన్నారు. ఇంత అన్యాయం గిరిజనులకు జరుగుతున్నా గిరిజన ఎమ్మెల్యేలు మౌనంగా ఉండడం సరైంది కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 1986 మొదలు జిఒ 275 నుండి నిన్నటి జీవో 3 వరకు ఉపాధ్యాయ నియామకాల్లో గిరిజన ప్రాంతంలో గిరిజనులకు మేలు జరిగిందని ఈ నోటిఫికేషన్‌లో జిపిఎస్ పాఠశాలలో పోస్టులు సైతం గిరిజనేతరులకు రిజర్వు చేశారని, ఇంతకన్నా అన్యాయం మరొకటి లేదని అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం గిరిజన ప్రత్యేక డిఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి గిరిజన ప్రాంతంలో ఉపాధ్యాయ పోస్టులు గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

7న జెఎసి ఆధ్వర్యాన ర్యాలీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజన హక్కులు, చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ మే 7న గుమ్మలక్ష్మీపురంలో చేపట్టబోయే ర్యాలీ, బహిరంగసభకు ఆదివాసీ మాజీ, తాజా ప్రజా ప్రతినిధులు, గిరిజన నిరుద్యోగ యువతీ యువకులు, గిరిజన సంఘం నాయకులు, ఆదివాసీ పెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆదివాసి జెఎసి జిల్లా నాయకులు ఆరిక చంద్రశేఖర్, ఇంటికుప్పల రామకృష్ణ, లోవరాజు, సీతారాం, భూషణ్, తిరుపతిరావు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీలో గిరిజనులకు తీవ్రం నష్టం వాటిల్లిందన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి రద్దయిన జిఒ 3 స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకొచ్చి గిరిజన ప్రాంతంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను గిరిజనులచేతే భర్తీ చేస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చలేదన్నారు. గిరిజనుల కోసం ఐటిడిఎ ద్వారా ప్రత్యేక డిఎస్‌సిని ప్రకటించాలని, 1/70 భూ బదలాయింపు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, ఆంధ్రప్రదేశ్ ట్రైబల్‌అడ్వైజర్ కమిటీని తక్షణమే ఏర్పాటు చేయాలని, ఐటిడిఎ పాలకవర్గ సమావేశం ఏర్పాటు చేసి గిరిజన అభివృద్ధికి సంబంధించి తీర్మానాలు చేయాలని డిమాండ్ చేశారు. నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యోగులు చేస్తున్న వారిపై సమగ్ర దర్యాప్తు జరిపి ఆ ధ్రువపత్రాలును రద్దు చేయాలని కోరారు. ర్యాలీ, సభకు గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్‌సిఎస్‌జెఎం పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - పార్వతీపురం

విజయనగరం జిల్లా చీపురుపల్లి సెకండ్ క్లాస్ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పోస్టు కోసం దరఖాస్తులను కోరుతున్నట్లు విజయనగరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు పూరించిన మూడు ప్రతుల దరఖాస్తులను మే 10లోగా తమ కార్యాలయానికి సమర్పించాలన్నారు. ఈ నోటిఫికేషన్‌ను ఎటువంటి కారణాలు చూపకుండా ఎప్పుడైనా రద్దు చేసే హక్కు ఉందని స్పష్టం చేశారు. రాష్ట్ర జ్యుడీషియల్ సర్వీస్‌లో ఏదైనా పదవిని నిర్వహించి పదవీ విరమణ లేదా రాజీనామా చేసిన వారు, అలాగే రాష్ట్రంలో సూపరింటెండెంట్ (ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ మినిస్టీరియల్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్ కేటగిరీ-3 2019) స్థాయికి తగ్గకుండా ఆం.ప్ర. జ్యుడీషియల్ మినిస్టీరియల్ సబార్డినేట్ సర్వీస్‌లో పోస్ట్ కలిగి, లా డిగ్రీ కలిగి ఉన్నవారు ఈ పోస్టుకు అర్హులని అన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సేవలో సెక్షన్ ఆఫీసర్, అంతకంటే ఎక్కువ పదవిని కలిగి ఉండి, లా డిగ్రీ కలిగిన వారు, కనీసం ఐదేళ్ల పాటు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసి, ప్రస్తుతం బార్ కౌన్సిల్ జాబితాలో లేని వారు కూడా అర్హులని పేర్కొన్నారు. భారతీయ శిక్షాస్మృతి, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ లేదా భారతీయ న్యాయ సంహిత 2023, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత 2023తో కూడిన క్రిమినల్ జ్యుడీషియల్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన ఏదైనా రిటైర్డ్ గెజిటెడ్ అధికారి, మూడు కంటే తక్కువ కాకుండా తన పదవీ కాలంలో మెజిస్ట్రీయల్ అధికారాలను కలిగి వున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని ఆ ప్రకటనలో వివరించారు. రిటైర్డ్ జ్యుడీషియల్ అధికారికి తగిన ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు. నాన్-ప్రాక్టీస్ న్యాయవాది, బార్‌లో ఐదేళ్ల కంటే తక్కువ కాకుండా 45 ఏళ్లకు పైబడి, 65 ఏళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న రిటైర్డ్ వ్యక్తులు, 65 ఏళ్ల వయస్సు పూర్తి చేయడానికి కనీసం ఒకటిన్నర సంవత్సరాలు ఉన్నవారు నోటిఫికేషన్ తేదీకి మాత్రమే అర్హత ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. పోస్టుకు ఎంపికైన సెకండ్ క్లాస్ ప్రత్యేక జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌లు వారంలో ఐదు రోజులు అనగా సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 07:30 నుంచి 10:30 గం.ల వరకు కోర్టు పనిని నిర్వహించాలని అన్నారు. వీరికి గౌరవ వేతనం కింద ప్రస్తుతం నెలకు రూ.45వేలు, రవాణా కోసం రూ.5వేలు చెల్లించబడుతుందని, ప్రభుత్వం ద్వారా ఎప్పటికప్పుడు, పెంపుదలకు లోబడి పెరుగుదల ఉంటుందని ఆమె ఆ ప్రకటనలో వివరించారు.



చిట్టిపూడివలసలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఉగ్రవాదుల దాడులకు నిరసనగా ర్యాలీ

ప్రజాశక్తి - వీరఘట్టం

కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడికి నిరసనగా మండలంలోని చిట్టిపూడివలస గ్రామ పురవీధుల్లో మంగళవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదం డౌన్ డౌన్ అంటూ పురవీధులలో నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.రాంబాబు, సచివాలయ కార్యదర్శి ఎన్.శివ, సిబ్బంది, విద్యార్థులు, పాల్గొన్నారు.

బేబీ ఫీడింగ్ సెంటర్‌ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

బేబీ ఫీడింగ్ సెంటర్‌ను బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర అన్నారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పట్టణానికి చెందిన పసుమర్తి వెంకటప్రసాద్ (బుజ్జి) తన తండ్రి పేరున, లయన్స్ క్లబ్ సంయుక్తంగా బేబీ ఫీడింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం మంచి నిర్ణయమని కొనియాడారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వస్తున్న వివిధ ప్రాంతాల బాలింతలు, చిన్నారులకు ఎంతో ఉపయోగకరమన్నారు. దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కేంద్రం నిర్వహణలో ఆర్టీసీ అధికారులు కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో లైన్స్ క్లబ్ సభ్యులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంతర పంటలతో పురుగుల ఉధృతి తగ్గుముఖం

ప్రజాశక్తి - వీరఘట్టం

అంతర్ పంటల ద్వారా పురుగుల ఉధృతిని తగ్గించవచ్చునని ప్రకృతి వ్యవసాయ డిపిఎం షణ్ముఖరాజు రైతులకు సూచించారు. మండలంలోని విక్రంపురంలో గుల్లి రాగి పంటను మంగళవారం పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. పురుగుల ఉధృతి తగ్గడంతో పాటు భూమి సేంద్రియం నిలగదొక్కుతుందని, ఆ విధంగా పంట దిగుబడితో పాటు ఆర్థికంగా సంపాదించవచ్చునని ఆయన అన్నారు. ముఖ్యంగా రైతులు ప్రకృతి వ్యవసాయ పంటలు సాగు చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఎపిఎన్‌ఎఫ్ మారుతి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

1300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మండలో ప్రొబిషన్ ఎక్సైజ్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించగా 1300 లీటర్లు బెల్లం ఊటలు ధ్వంసం చేశారు. 20 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. అలాగే చిన్న బగ్గ కొండలు సమీపాన ఎస్సై వై అమ్మనరావు ఆధ్వర్యంలో మంగళవారం బెల్లం ఊటలను నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సారా తయారు చేసినా, అమ్మినా, తయారీకి ముడుసరుకు సరఫరా చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమాల్లో ఎక్సైజ్ అధికారి శ్రీరంగదొర, ఇన్స్పెక్టర్ సూర్యకుమారి, మహేష్, మురళి పాల్గొన్నారు.

రోడ్డు పూర్తి చేయండి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని నడిమిబుడగరాయి నుంచి ఎగువ బుడగరాయి వరకు రహదారి పూర్తి చేయాలని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు గ్రామస్తులు సవర సొట్టయ్య, మాధవ తదితరులు వినతి అందజేశారు. రహదారి పనులు అసంపూర్తిగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని వారు తెలిపారు.

ముమ్మరంగా అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలోని మందిరం వీధి, మర్రి, బాబు జగజ్జీవన్‌రాం కాలనీ, బిసి కాలనీ తదితర వీధుల్లో ముమ్మరంగా అభివృద్ధి పనులు చేపడుతున్నారు. మురికి కాలువలు, శ్మశాన వాటిక రహదారులు, వీధుల్లో సిసి రహదారులు, మేజర్ పంచాయతీ జనరల్ ఫండ్ నుంచి లక్షలాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఇఒ బి.కోటేశ్వరరావు తెలిపారు.

పది విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

ప్రజాశక్తి - సీతంపేట

ఇటీవల పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన సీతంపేట ఐటిడిఎ పరిధిలోని విద్యార్థులకు స్థానిక బాలికల, బాలుర ఆశ్రమ పాఠశాలలో ఈనెల 30 ఉదయం నుండి నిపుణులైన ఉపాధ్యాయులచే ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు డిడి అన్నదొర తెలిపారు. బాలురకు, సీతంపేట బాలుర ఆశ్రమ పాఠశాలలోనూ బాలికలకు సీతంపేట బాలికల ఆశ్రమ పాఠశాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణకు బాలికలు 49 మంది, బాలురు 88 మంది హాజరవుతున్నట్లు తెలిపారు.

'పూలే' పేరు విస్మరించడం సరికాదు

ప్రజాశక్తి- బొబ్బిలి

రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన ప్రముఖులు, మహనీయులు జయంతి, వర్ధంతుల జాబితాలో భారతదేశ మొదటి ఉపాధ్యాయురాలు, గొప్ప సంఘసంస్కర్త సావిత్రిభాయి పూలే పేరును తొలగించడం సరికాదని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె. విజయగౌరి అన్నారు. మంగళవారం వాసు కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె మట్లాడారు. ాామాజిక ఉద్యమాలను ప్రోత్సహించి, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా చైతన్యం నింపిన ఆమె జయంతి జనవరి 3, వర్ధంతి మార్చి 10ని ప్రముఖుల జాబితాలో చేర్చాలని, దేశం గర్వించదగ్గ మహాకవి గురజాడ జాతిని మేల్కొలిపిన దేశమును ప్రేమించుమన్నా.. మంచియన్నది పెంచుమన్నా ఖండాంతరాలలో మార్మోగుతున్న గేయాన్ని రాసిన గురజాడ జయంతిని ప్రముఖుల జాబితాలో విస్మరించడం మరింత బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో సావిత్రి భాయి పూలే, గురజాడ అప్పారావు జయంతులను, వర్ధంతులను చేర్చాలని మహిళా టీచర్ల ఫోరంగా, యుటిఎఫ్‌గా కోరుతున్నామన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

ప్రజాశక్తి - కురుపాం

వేర్వేరు ప్రాంతాల్లో ఎదురు ఎదురుగా వస్తు ద్విచక్ర వాహనాలు ఢీకొని పలువురికి గాయాలైన సంఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు అందించిన సమాచారం ప్రకారం మండలంలో మొండెంఖల్ సమీపాన జి.శివడ జంక్షన్ దగ్గర శ్రీరాంపురానికి చెందిన బి.రాజు (40), ఎ.సింగ (65) ద్విచక్ర వాహనంతో మొండెంఖల్ నుంచి వారి గ్రామానికి వెళ్తుండగా గొల్లగానిగూడకు చెందిన బి.విజయ (23), ఎ.జీవన్ (18) ద్విచక్ర వాహనంతో ఎదురుగా వస్తుండగా ఢీకొనడంతో నలుగురికి గాయాలయ్యాయి. ఫీడర్ అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా డ్రైవర్ సురేష్ వెంటనే వచ్చి మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అక్కడ ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్ర ఆస్పత్రికి బి.రాజు, ఎ.సింగను తరలించినట్లు తెలిపారు. నీలకంఠపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మండల కేంద్రానికి సమీపాన గల మూలిగూడ జంక్షన్‌లో జరిగిన ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. స్థానిక పోలీసులు అందించిన సమాచారం ప్రకారం పెదఖర్జ నుంచి ద్విచక్ర వాహనంతో నిమ్మల బుజ్జి (20) వారి బంధువుతో మక్కువ వెళు_ండగా శ్రీను అనే వ్యక్తి ద్విచక్ర వాహనంతో కురుపాం నుంచి గుమ్మలక్ష్మీపురం వెళ్తుండగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని మహిళకు తీవ్ర గాయాలయ్యాలని కురుపాం సిహెచ్‌సి తరలించి ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



సంఘటనా స్థలంలో క్షతగాత్రులు

యుహెచ్‌సిలో తనిఖీలు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జగన్నాధపురం, చర్చివీధి పట్టణ ఆరోగ్య కేంద్రాలను (యుహెచ్‌సి) వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో వైద్య సేవలందజేస్తున్న తీరు, ఆరోగ్య పరీక్షల నిర్వహణ, సిబ్బంది హాజరు వివరాలపై పర్యవేక్షణ చేసి రికార్డులు తనిఖీ చేశారు. ల్యాబ్‌లో పరికరాల పనితీరు తెలుసుకొని, నిర్ధారణ పరీక్షలు నివేదికల రికార్డులు పరిశీలించారు. ల్యాబ్ పరీక్షల నివేదికలు అందజేయడంలో జాప్యం ఉండకూడదన్నారు. మందులు, ఒఆర్‌ఎస్ లభ్యత పరిశీలించారు. అక్కడ చికిత్సకు వచ్చిన రోగుల ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. తాగునీటి లభ్యత పరిశీలించారు. అనంతరం డాక్టర్ జగన్మోహన్ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరుపై సమీక్షించి ప్రగతి నివేదికలు పరిశీలించారు. జ్వరాలు, టైఫాయిడ్, డయేరియా గుర్తిస్తే క్షేత్ర స్థాయి కార్యాచరణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ బి.రవిచంద్ర, డాక్టర్ వై.గణేష్, డాక్టర్ ఎం.చాంద్, డిపిహెచ్‌ఎన్‌ఒ ఉషారాణి, సూపర్వైజర్లు పుష్ప,ఇందిర వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.